# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 12 ఏప్రిల్ 2025 | www.balagamtv.com | పేజీలు 4




పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు
హనుమాన్ జయంతి శుభాకాంక్షలు

# ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో



- పతిపాదనలు సిద్ధం చేయాలి
- మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనల పురోగతిపై ఆరా
- కేంద్రం నుంచి అనుమతులు సాధించేందుకు నిరంతరం ప్రయత్నించాలి
- ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వరకు మెట్రో విస్తరించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలి
- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి
- కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి సమీక్ష



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ మెట్రోను ఫ్యూచర్ వరకు విస్తరించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ విస్తరణకు అవసరమైన తుది ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలో మెట్రో విస్తరణపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనల పురోగతిని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉందని, ఇప్పటికే ఢిల్లీలో అధికారులను కలిసి సంప్రదింపులు జరిపినట్లు అధికారులు వివరించారు.

నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ వరకు (36.8 కి.మీ.), రాయదుర్గం – కోకాపేట నియోపోలిస్ (11.6 కి.మీ.), ఎంజీబీఎస్ – చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), మియాపూర్ – పటాన్‌చెరు (13.4 కి.మీ.), ఎల్బీ నగర్ – హయత్‌నగర్ (7.1 కి.మీ.) మొత్తం కలిపి 76.4 కి.మీ.ల విస్తరణకు రూ.24,269 కోట్ల అంచనాలతో హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించి డీపీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపించింది. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం చెరిసగం నిధులు భరించేలా జాయింట్ వెంచర్‌గా ఈ ప్రాజెక్టు చేపట్టేలా ప్రతిపాదనలు తయారు చేసింది. కేంద్రం నుంచి అనుమతులు సాధించేందుకు నిరంతరం ప్రయత్నించాలని, అనుమతులు రాగానే పనులు ప్రారంభించేందుకు సన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి గారు అధికారులను ఆదేశించారు.

ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వరకు 40 కిలోమీటర్ల మేరకు మెట్రో విస్తరించేందుకు కొత్తగా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దాదాపు 30 వేల ఎకరాల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చెందుతుందని, భవిష్యత్తు నగర విస్తరణ అవసరాల దృష్ట్యా మెట్రోను మీర్ఖాన్‌పేట్ వరకు పొడిగించాలని చెప్పారు. అందుకు అవసరమయ్యే అంచనాలతో డీపీఆర్ తయారు చేసి కేంద్రానికి పంపించాలని సూచించారు. హెచ్ఎండీఏ తో పాటు ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీని ఈ రూట్ మెట్రో విస్తరణలో భాగస్వామ్యులను చేయాలని చెప్పారు. ముఖ్యమంత్రితో పాటు సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, శ్రీనివాసరాజు, హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, సంబంధిత ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## కేంద్రాన్ని పోషించే రాష్ట్రాలలో ముందు వరుసలో తెలంగాణ



- నేతన్నలు, రైతన్నల సంక్షేమం ప్రాధాన్యతగా ప్రభుత్వ పాలన..
- కంచె గచ్చిబౌలిలో 400 ఎకరాలు ముమ్మాటికి ప్రభుత్వ భూమే..
- వస్త్ర పరిశ్రమ పై జీఎస్టీని కేంద్ర మంత్రి బండి సంజయ్ తొలగించాలి
- అపెరల్ పార్క్ లో మరో పరిశ్రమ యూనిట్ ను ప్రారంభించిన మంత్రులు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

కేంద్రాన్ని పోషించే రాష్ట్రాలలో తెలంగాణ మందు వరుసలో ఉంటుందని,రాష్ట్రం సొమ్ము తోనే కేంద్రం పథకాలు నడుసున్నాయని, కేంద్ర ప్రభుత్వం కూడా రాష్ట్ర ప్రభుత్వం ఫోటో లు పెట్టుకోవాలని రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని అపెరల్ పార్క్ లో 7.6 ఎకరాల విస్తీర్ణంలో 62 కోట్లతో లక్షా 73 వేల చదరపు అడుగుల లిపంక్చుయేట్ వరల్డ్ ప్రైవేట్ లిమిటెడ్( టెక్స్ పోర్ట్)యూనిట్ ను శుక్రవారం చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, బిసి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝు లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిశ్రమ శిలా ఫలకాన్నీ ఆవిష్కరించారు. యూనిట్ లోని ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. అనంతరం యూనిట్ లోని ఉద్యోగుల తో మాట్లాడారు.

మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ రైతన్నలు, నేతన్నల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యత అని, వీరిని దృష్టిలో పెట్టుకుని మౌలిక వసతులు కల్పిస్తూ రాష్ట్ర యువతకు అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం పని చేస్తుందనిఅన్నారు. నేతన్నల జీవనోపాధి కల్పించే విధంగా సిరిసిల్ల గడ్డ మీద వర్కర్ టూ ఓనర్, అపెరల్ పార్క్ ఏర్పాటు వంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. . గత 10 ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో ఆర్థిక విధ్వంసంతో ఆర్థిక ఇబ్బందులతో ఉన్న కానీ, ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని అన్నారు.20 వేల 600 కోట్ల రూపాయల రైతులకు ఏక కాలంలో రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అని, నేతన్న లకు కూడా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా 34 కోట్ల రూపాయలతో లక్ష రూపాయల రుణమాఫీ పూర్తి చేశామనిఅన్నారు. నేతన్న లకు పెండింగ్ లో ఉన్న 914 కోట్ల బకాయిలు విడుదల చేయడం జరిగిందని అన్నారు. ఒకే రోజు వివిధ పథకాల క్రింద 290 కోట్ల నిధులు జమ చేసామని, చేనేత భరోసా, చేనేత బీమా పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో అన్ని శాఖలలో అవసరమైన వస్త్రాలను చేనేత కార్మికుల ద్వారానే కొనుగోలు చేస్తున్నామని, ఇప్పటికే కార్మికులకు 900 కోట్ల రూపాయల ఆర్డర్స్ ప్రభుత్వం అందించిందని అన్నారు. ముఖ్యమంత్రితో చర్చించి త్వరలోనే వర్కర్ టు ఓనర్ కార్యక్రమం పునరుద్ధరిస్తామని అన్నారు.

మిగితా 3వ పేజీలో

## వందేళ్ల అవసరాలకు అనుగుణంగా డ్రైపోర్ట్

- రూపకల్పన చేయాలి
- రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించిన భూ సేకరణ పూర్తి చేయాలి
- రహదారుల విస్తరణపైనా ప్రత్యేక దృష్టి సారించాలి
- ఆర్ఆర్ఆర్ ఎన్‌హెచ్‌లపై సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

వివరాలు 2వ పేజీలో



## హెచ్‌సీయూ భూముల్లో బడా ఆర్థిక మోసం

- పర్యావరణ విధ్వంసంతో పాటు రూ. 10 వేల కోట్ల స్కామ్
- ఈ భూ కుంభకోణానికి కర్త, కర్మ, క్రియ, సూత్రధారి, పాత్రధారి అంతా రేవంత్ రెడ్డినే
- బీజేపీ ఎంపీ కూడా సహకరిస్తున్నారు.
- ఈ స్కాంపై కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తాం.
- ప్రధాని మోడీ విచారణకు ఆదేశించాలి
- డిసెప్షన్, డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్ అనే 3డీ మంత్రతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేద లు, మధ్యతరగతి బతుకుల్ని నాశనం చేస్తోంది.

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

"హెచ్‌సీయూ భూముల్లో పర్యావరణ విధ్వంసమే కాదు.. రూ. 10 వేల కోట్ల బడా ఆర్థిక మోసం జరిగింది. ఈ భూ కుంభకోణానికి కర్త, కర్మ, క్రియ, సూత్రధారి, పాత్రధారి అంతా రేవంత్ రెడ్డినే. భూ యాజమాన్య హక్కు ఎవరిదో తెలుసుకోకుండానే పది వేల కోట్ల లోన్ ఇచ్చిన ఐసిఐసిఐ బ్యాంకు తన క్రెడిబిలిటీని కోల్పోయింది. త్వరలోనే ఆ బ్యాంక్ కుప్పకూలడం ఖాయం. ఈ స్కాంపై సమగ్ర విచారణ జరపాలని కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తాం. ప్రధాని మోడీ వెంటనే స్పందించి విచారణకు ఆదేశించి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ 15- 16 నెలల్లో డిసెప్షన్, డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్ అనే 3డీ మంత్రతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదలు, మధ్యతరగతి బతుకుల్ని నాశనం చేస్తోంది. దేశానికే అన్నం పెట్టే స్థాయికి చేరుకున్న తెలంగాణ రైతన్న కడుపు మీద కొట్టారు. ప్రజల దృష్టి మరల్చి, భయంకరమైన ఆర్థిక దోపిడీకి రేవంత్ ప్రభుత్వం పాల్పడింది. హెచ్‌సీయూలో జరిగిన పర్యావరణ విధ్వంసంపై దేశం మొత్తం నివ్వెర పోయి చూసింది. అక్కడ పర్యావరణ విధ్వంసం, మూగజీవుల ప్రాణాలు మాత్రమే తీయలేదు. హెచ్‌సీయూ పక్కన ఉన్న అటవీ భూములను అడ్డం పెట్టుకుని ఒక అతిపెద్ద ఆర్థిక మోసానికి రేవంత్ ప్రభుత్వం పాల్పడింది. ఇదొక నేరపూరిత కుట్ర. తెలంగాణ ప్రజల పట్ల విశ్వాసఘాతుకం.రాత్రికి రాత్రి బుల్డోజర్లను పెట్టి వందల ఎకరాల్లో చెట్లను కూల్చివేసి మూగ జీవాలకు నిలువ నీడ లేకుండా చేసిన రేవంత్ ప్రభుత్వ ఆరాటం వెనుక పదివేల కోట్ల రూపాయల స్కాం ఉంది. సుప్రీం కోర్టు తీర్పుల ప్రకారం ఆ 400 ఎకరాలు ముమ్మాటికి అటవీ భూమే.రిజర్వ్ ఫారెస్ట్ అని ప్రత్యేకంగా డిక్లేర్ చేయకపోయినా అడవులకు ఉండాల్సిన లక్షణాలు ఉంటే యాజమాన్య హక్కులు ఎవరి పేరు మీద ఉన్నా దాన్ని అటవీ భూమి గానే గుర్తించాలని 1996లో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. అలాంటి భూముల లెక్కలు తీయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు కూడా ఇచ్చింది పాయింట్ ఫోర్ కానోపి ఉన్న భూమి కచ్చితంగా అటవీ భూమినే.

1980 ఫారెస్ట్ కన్సర్వేషన్ యాక్ట్ ప్రకారం అటవీ భూములను తాకట్టుపెట్టే లేదా అమ్మే హక్కు రాష్ట్ర ప్రభుత్వాలకు లేదు. అటవీశాఖ అనుమతి లేదు ఎన్విరాన్మెంటల్ ఇంపాక్ట్ అసెస్మెంట్ కూడా చేయలేదు. అయినా కూడా రేవంత్ ప్రభుత్వం భారీ ఆర్థిక నేరానికి పాల్పడింది. ఒక బీజేపీ ఎంపీ పూర్తి స్థాయిలో సహకరించి ట్రస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ ప్రైవేట్ లిమిటెడ్ అనే బ్రోకర్ కంపెనీని తీసుకొచ్చి ఈ కాన్సెప్ట్ ను చెప్పారు.ఎఫ్ఆర్బీఎంను బైపాస్ చేసి డబ్బులు తీసుకొస్తామని చెప్పి అందుకు కమిషన్ ఇవ్వాలని ఆ కంపెనీ

మిగితా 2వ పేజీలో

## మూసీ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలి


- మీర్ ఆలం ట్యాంక్‌పైన బ్రిడ్జి నిర్మాణ పనులకు జూన్‌లో టెండర్లు పిలవాలి
- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి
- మూసీ పునరుజ్జీవనంపై ఉన్నతాధికారులతో సమీక్ష
- బ్రిడ్జికి సంబంధించి కన్సెల్టెన్సీలు తయారు చేసిన నమూనా డిజైన్ల పరిశీలన

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. బాపూ ఘాట్ వద్ద నిర్మించ తలపెట్టిన గాంధీ సరోవర్‌తో పాటు మీర్ ఆలం ట్యాంక్‌పై నిర్మించనున్న బ్రిడ్జి నమూనాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. మీర్ ఆలం ట్యాంక్‌పైన బ్రిడ్జి నిర్మాణ పనులకు జూన్‌లో టెండర్లు పిలవాలని చెప్పారు. ఈలోగా అందుకు అవసరమైన సర్వేలు, నివేదికలు, ప్రతిపాదనలు, డిజైన్లతో డీపీఆర్‌ను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.మూసీ పునరుజ్జీవనంపై ముఖ్యమంత్రి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. మీర్ ఆలం ట్యాంక్‌పై నిర్మించే బ్రిడ్జికి సంబంధించి కన్సెల్టెన్సీలు తయారు చేసిన నమూనా డిజైన్లను అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు పలు సూచనలు చేశారు.

రెండున్నర కిలోమీటర్ల పొడవైన ఈ బ్రిడ్జిని అద్భుతంగా నిర్మించాలి. సందర్శకులు, ప్రయాణికుల రక్షణకు అధిక ప్రాధాన్యత ఉండే విధంగా డిజైన్లను ఎంచుకోవాలి. ఈ బ్రిడ్జితో పాటు మీర్ ఆలం ట్యాంక్‌లో వివిధ చోట్ల ఐలాండ్లు ఉన్న మూడు ప్రాంతాలను పర్యాటకులను ఆకట్టుకునేలా అందంగా తీర్చిదిద్దాలి. సింగపూర్‌లోని 'గార్డెన్స్ బై ది బే' ను తలపించేలా బర్డ్స్ పారడైజ్, వాటర్ ఫాల్స్ లాంటివి ఉండేలా ఈ మూడు ఐలాండ్లను అత్యంత సుందరంగా అభివృద్ధి చేయాలి. వెడ్డింగ్ డెస్టినేషన్‌కు వీలుగా ఉండే కన్వెన్షన్ సెంటర్లతో పాటు అడ్వంచర్ పార్క్, థీమ్ పార్క్, అంఫీ థియేటర్‌తో కూడిన డిజైన్లు ఉండాలి.బోటింగ్‌తో పాటు పర్యాటకులు విడిది చేసేలా రిసార్ట్స్, హోటల్స్ అందుబాటులో ఉండాలి. ట్యాంక్‌లో నీటిని శుద్ధి చేయటంతో పాటు ఐలాండ్‌ను అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని ప్రతిపాదనలతో డీపీఆర్ సిద్ధం చేయాలి. పీపీపీ మోడల్లో ఈ ఐలాండ్ జోన్‌ను అభివృద్ధి చేసేలా ప్రతిపాదనలు తయారు చేయాలి.

మీర్ అలం ట్యాంక్‌లో నీటి లభ్యతను, వరద వచ్చినప్పుడు ఉండే నీటి ప్రవాహ తీవ్రతను ముందుగానే అంచనా వేసుకొని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందు చూపుతో డిజైన్లు రూపొందించాలి. ఈ ప్రాజెక్టుకు అవసరమైన హైడ్రాలజీతో పాటు పర్యావరణానికి సంబంధించి నిపుణులు, లేదా ఆ రంగంలో పేరొందిన సంస్థలతో సర్వే చేయించి ఆ మేరకు అవసరమైన అన్ని అనుమతులు తీసుకోవాలి. మీర్ ఆలం బ్రిడ్జితో పాటు ఈ ఐలాండ్ జోన్‌ను పక్కనే ఉన్న జూ పార్కుకు అనుసంధానం చేయాలి. ఇక్కడి అభివృద్ధి ప్రణాళికలను దృష్టిలో పెట్టుకొని జూ పార్కును అప్‌గ్రేడ్ చేయాలి. జూ అధికారులతో సంప్రదింపులు జరిపి, నిబంధనల ప్రకారం అప్‌గ్రేడ్ చేసేందుకు ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించాలి. అభివృద్ధి ప్రతిపాదనలన్నీ పర్యాటకులను మరింత ఆకట్టుకునేలా ఉండాలి... అని ముఖ్యమంత్రి గారు సూచించారు.ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి గారు, శ్రీనివాస రాజు గారు, మున్సిపల్ శాఖ, మూసీ రివర్ ఫ్రంట్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## పూలే విగ్రహానికి సీఎం నివాళి

### మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహ ఏర్పాటుకు స్థలం పరిశీలన

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా హైదరాబాద్ అంబర్‌పేటలోని ఆ మహనీయుడి విగ్రహానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంతకుముందు ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతో కలిసి మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహ ఏర్పాటుకు సంబంధించి నెక్లెస్ రోడ్డు మార్గం, ఐమాక్స్ సమీపంలో స్థలాన్ని పరిశీలించారు. స్థలాన్ని పూర్తిస్థాయిలో సర్వే చేసి విగ్రహ ఏర్పాటుకు అవసమైన ప్రణాళికను అందించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి గారితో పాటు సలహాదారు వేం నరేందర్ రెడ్డి గారు, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ గారు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ గారు, పలువురు ప్రజాప్రతినిధులు, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి గారితో పాటు అధికారులు పాల్గొన్నారు.



## టీజీ టెట్ నోటిఫికేషన్ విడుదల

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

టీచర్ ఎలిజబిలిటీ టెస్ట్ నోటిఫికేషన్ విడుదలైంది. జూన్ 15 నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో టెట్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇక దరఖాస్తుల ప్రక్రియ, తదితర వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో ఈ నెల 15 నుంచి అందుబాటులో ఉండనున్నాయి. టెట్ వివరాలు, దరఖాస్తు కోసం schooledu.telangana.gov.in అనే వెబ్‌సైట్‌ను లాగిన్ అవ్వాలి.

## పదేండ్లలో భూ దోపిడీపై చర్చకు సిద్ధమా?




- ఈ-ఫార్ములా రేసు కుంభ కోణంలో కేటీఆర్ అరెస్టు తప్పదు
- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

వివరాలు 2వ పేజీలో

## బీహార్, యూపీ, జార్ఖండ్‌లో భారీ వర్షాలు

### 102 మంది మృతి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

బీహార్, ఉత్తర ప్రదేశ్, జార్ఖండ్‌లో భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా ఈ మూడు రాష్ట్రాల్లోనూ 102 మంది మర ణించారు. అనేక మంది గాయ పడ్డారు. బీహార్‌లో అత్యధికంగా 80 మంది మరణిం చారు. రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లా ల్లోనూ గురు, శుక్రవారాల్లో భారీ వర్షాలు కురిసాయి. దీంతో అనేక ప్రాంతాలు జలమ య్యాయి. పిడుగులు, వడగండ్ల కారణంగా మరణాలు సంభవిం చినట్లు ప్రభుత్వం తెలిపింది. మృతుల కుటుంబాల ఒకొక్కరికీ రూ 4 లక్షల పరిహారాన్ని ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ ప్రకటించారు. అయితే రాష్ట్రంలో మృతుల సంఖ్య ఇంకా ఎక్కువే ఉందని ఆర్‌జేడీ నాయకులు తేజస్వీ యాదవ్ తెలిపారు. వర్షాలతో నష్టపోయిన రైతులకు కూడా పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాని డిమాండ్ చేశారు.

# వందేళ్ల అవసరాలకు అనుగుణంగా డ్రైపోర్ట్

- రూపకల్పన చేయాలి
- రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించిన భూ సేకరణ పూర్తి చేయాలి
- రహదారుల విస్తరణపైనా ప్రత్యేక దృష్టి సారించాలి
- ఆర్ఆర్ఆర్ ఎన్‌హెచ్‌లపై సమీక్ష లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్**

రానున్న వందేళ్ల అవసరాలకు అనుగుణంగా డ్రైపోర్ట్‌కు రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గారు అధికారులకు సూచించారు. రీజినల్ రింగ్ రోడ్డు సమీపంలో సరైన ప్రాంతంలో డ్రైపోర్ట్ ఉండాలని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం, ఆర్ఆర్ఆర్ పనుల పురోగతిపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. ఇటీవల రాష్ట్ర పునర్విభజన అంశాలపై ఢిల్లీలో జరిగిన తెలంగాణ, ఏపీ అధికారుల సమావేశంలో హైదరాబాద్ – విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి అవసరమైన డీపీఆర్ తయారీకి సూత్రప్రాయ ఆమోదం తెలపాలని కేంద్ర హోం శాఖ కార్యదర్శి ఆదేశించిన నేపథ్యంలో ఆ పనులపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి గారు సూచించారు.

?? రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించిన భూ సేకరణ పూర్తి చేయాలని, దక్షిణ భాగం డీపీఆర్ కన్సల్టెన్సీ నివేదికను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరాన్ని ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌తో అనుసంధానించేలా జాతీయ రహదారికి ప్రతిపాదనలు తయారు చేసి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థకు పంపించాలని ముఖ్యమంత్రి సూచించారు.

హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు కొత్త జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి భూ సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులపై ముఖ్యమంత్రి గారు ఆరా తీశారు. పలు చోట్ల పంటలు ఉన్నాయని, పంట నష్టపరిహారం చెల్లించేందుకు ఎన్‌హెచ్ఏఐ అంగీకరించడం లేదని అధికారులు వివరించారు.పంట కాలం దాదాపు పూర్తవుతున్నందున ఆ వెంటనే రైతులతో మాట్లాడి భూ సేకరణ పూర్తి చేయాలని ముఖ్యమంత్రి గారు తెలిపారు. భూ సేకరణకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే ఆయా జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేకంగా మాట్లాడాలని, సాంకేతిక, న్యాయ సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి సూచించారు. ఔటర్ రింగు రోడ్డు నుంచి రీజినల్ రింగు రోడ్డు వరకు రేడియల్ రోడ్లు, ఆర్ఆర్ఆర్ నుంచి తెలంగాణ సరిహద్దుల వరకు ఉన్న రహదారుల విస్తరణపైనా ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఈ సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి గారు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గారితో పాటు ఆర్ అండ్ బీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 14 నుంచి భూ భారతి

- రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్**

భూ భారతిని ఈనెల 14న ప్రారంభి స్తామని, దొరల ప్రభుత్వానికి ప్రతీకగా నిలిచిన ప్రగతి భవన్‌ను జ్యోతిరావు పూలే భవనంగా మార్చామని రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహిం చిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. రూ.20 కోట్లతో పినపాక నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని, పులుసు బొంత ప్రాజెక్టును త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. ధరణి పేరుతో గత ప్రభుత్వం రూ.1.57 కోట్ల ఎకరాల భూమిని తాకట్టు పెట్టారని అన్నారు. ధరణి కారణంగా రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. దాన్ని బంగాళాఖాతంలో పడేసి అనేక సాంకేతిక సమస్యలను అధిగమిస్తూ ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా శిల్పా రామంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రభుత్వ అధికారులతో భూభారతి చట్టాన్ని అమలు చేస్తున్నామన్నారు. 2025 భూ భారత చట్టం.. పేదరైతు నుంచి ఆసా ముల వరకు అందరికీ ఆమోదయోగ్యం గా ఉంటుందన్నారు. గత ఐదేండ్లలో రాష్ట్ర ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొ న్నారని తెలిపారు. అప్పల భారంతో కూరుకుపోయిన రాష్ట్రా న్ని ప్రతి సమస్య పరిష్కరించుకుంటూ ప్రజలకు భద్రత కల్పిస్తున్నామన్నారు. త్వరలోనే పులుసు బొంత ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి ప్రారంభిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కూనవరం గ్రామ పంచా యతీలోని వంక ముఖేందర్ గృహంలో సన్న బియ్యం భోజనం చేశారు. మండ లంలో పర్యటించి పలు అభివృద్ధి పను లకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్ర మంలో మహబూబా బాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్ పాల్గొన్నారు.

# పదేండ్లలో భూ దోపిడీపై చర్చకు సిద్ధమా?

- ఈ-ఫార్ములా రేసు కుంభ కోణంలో కేటీ ఆర్ అరెస్టు తప్పదు
- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

**బలగం టీవి, హైదరాబాద్**

గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన భూదోపిడీపై విచారణ జరపాలని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు 'నా' అనుకున్న వారికి వేల ఎకరాలను అప్పనంగా కట్టబెట్టారని ఆరోపించారు. శుక్ర వారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఇతర పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. పదేండ్లలో భూ దోపిడీపై చర్చకు సిద్ధమా? దమ్ము, ధైర్యముంటే చర్చకు రావాలంటూ మాజీ మంత్రి కేటీఆర్‌కు ఈ సందర్భంగా ఆయన సవాల్ విసిరారు. కేసీఆర్ కుటుంబంపై సీబీఐతో విచారణ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హెచ్‌సీయూ అంశానికి కేటీఆర్ అరెస్ట్‌కు లింక్ పెట్టడమేంటని ప్రశ్నించారు. కేటీఆర్ మాట్లాడే మాటలకు చిన్న పిల్లలు సైతం నవ్వుకుంటున్నారని తెలిపారు. ఈ–ఫార్ములా రేసు కేసులో కేటీఆర్ ఏదో ఒక రోజు అరెస్టు కాక తప్పదని స్పష్టం చేశారు. పదేండ్ల పాలనలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం వేల ఎకరాలను విక్రయించిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ చుట్టూ ఉన్న వేల ఎకరాలను కేసీఆర్ తన వారికి మాత్రమే అమ్ముకున్నారని విమర్శించారు. కంచ గచ్చిబౌలి భూముల గురించి పదేండ్లలో ఎందుకు పోరాడలేదని ప్రశ్నించారు. హెచ్‌సీయూ భూముల సమస్య కోర్టు వివాదంలో ఉన్నప్పుడు ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. ఐఎంజీ సంస్థ అధినేత బిల్లీరావుతో కమీషన్ మాట్లాడుకొని ఆ భూములను పట్టించు కోలేదని అనుమానం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సుప్రీంకోర్టులో పోరాడి 400 ఎకరాలను సాధించామని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం ఆ భూములను కాపాడకపోయి ఉంటే, ఆ భూమి ఐఎంజీ చేతికి వెళ్లి ఉండేదని ఆందోళన వ్యక్తం చేశారు. బిల్లీరావుతో మాట్లాడుకున్న వేల కోట్ల కమీషన్ పోయిందనే

# హెచ్‌సీయూ భూముల్లో బడా ఆర్థిక మోసం

(మొదటి పేజీ తరువాయి)

కోరింది. ట్రస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ అనే కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం రూ. 169 కోట్లు లంచం చెల్లించింది. ఆ తరువాత బీకన్ ట్రస్టీ షిప్ అనే కంపెనీని ముందుకు పెట్టి మోసానికి పాల్పడ్డారు.సుప్రీం కోర్టు తీర్పు రాగానే రూ. 75 కోట్లకు ఒక ఎకరం చొప్పున ఆ 400 ఎకరాల భూమిని టీజీఐఐసీకి బదలాయిస్తున్నట్టు కాంగ్రెస్ ప్రభుత్వం ఒక జీవో ఇచ్చింది. జీవో మాత్రమే ఇచ్చారు కానీ ఆ భూమిని ఎలియనైజేషన్ చేయలేదు, సేల్ డీడ్ చేయలేదు, మ్యూటేషన్ కూడా చేయలేదు. అంటే ప్రభుత్వానికి ఆ భూమిపై ఓనర్ షిప్ రాలేదన్నట్టే. టీజీఐఐసీకి ఆ భూములపై ఓనర్‌షిప్ లేదు. తనది కాని భూమిని బ్రోకర్ కంపెనీ మాట విని టీజీఐఐసి తాకట్టు పెట్టింది. ఈ మోసానికి టీజీఐఐసీతో పాటు పరిశ్రమల శాఖ సెక్రెటరీని జైల్లో వేయొచ్చు ఎలాంటి వెరిఫికేషన్ చేయకుండా, భూ యాజమాన్య హక్కులు ఎవరి దగ్గర ఉన్నాయో తెలుసుకోకుండానే ఐసిఐసిఐ బ్యాంకు పదివేల కోట్ల డబ్బులు చెల్లించింది.స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ ప్రకారం కంచె గచ్చిబౌలి ఏరియాలో గజం విలువ 26,900 రూపాయలు. కానీ రెవిన్యూ శాఖ మాత్రం ఆ భూమి విలువ 30 వేల కోట్లు అని చెప్పుకుంది.

ప్రభుత్వం, బ్రోకర్ సంస్థ, ఐసిఐసిఐ బ్యాంకు కుమ్మక్కై ఆ భూమికి లేని విలువను ఉన్నట్లుగా చూపించి పదివేల కోట్ల లోన్ తీసుకున్నారు. రిజర్వ్ బ్యాంకును, బ్యాంకులను, దేశాన్ని రేవంత్ ప్రభుత్వం మోసం చేసింది. ఎకరానికి రూ. 75 కోట్లు అని జూన్ లో జీవో ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు నెలల తర్వాత మళ్లీ ఇంకో సంస్థతో నవంబర్ 23న కొత్త వాల్యుయేషన్ తీసుకొచ్చింది. ఎకరం రూ. 75 కోట్లు కాదు కేవలం రూ. 52 కోట్లు మాత్రమే అని రిపోర్ట్ తయారు చేశారు.ఈ ఐదు నెలల కాలంలో ఏం మారింది? రూ. 25 కోట్ల విలువ ఎందుకు తగ్గింది? ఆ తర్వాత బహిరంగ మార్కెట్లో రిలయబుల్ వ్యాల్యూ అసెస్‌మెంట్ అని ఎకరాకు రూ. 41.6 కోట్లు మాత్రమే అని ప్రభుత్వం ప్రకటించింది. ఇలా ఆ 400 ఎకరాల భూమి విలువను రూ. 30 వేల కోట్ల నుంచి రూ. 16,640 కోట్లకు ప్రభుత్వం కుదించింది. అదే బ్యాంకరు, అదే బ్రోకర్ ని అడ్డం పెట్టుకొని ప్రభుత్వం ఆ భూములను తమ మనుషులకు అడ్డికి పావు సేరు అమ్మడానికి రేవంత్ కుట్ర చేస్తున్నాడు. భూమిపై ఎలాంటి యాజమాన్య హక్కులు లేకుండానే టీజీఐఐసీ ఆ భూమిని ఐసిఐసిఐ బ్యాంకుకు ఎలా తనఖా పెట్టింది? ఎల్ సేల్ డీడ్ కూడా లేని భూమికి ఐసిఐసిఐ బ్యాంకు ఎలా రుణం ఇచ్చింది? ఇది ఫ్రాడ్ కాదా? బీకన్ ట్రస్టీ షిప్ అనే కంపెనీ, ట్రస్ట్ అడ్వైజర్స్ అనే బ్రోకర్ ని ప్రభుత్వం ఎలా ఎంపిక చేసింది? ఏ రూల్స్ ని ఫాలో అయ్యారు?బీజేపీ ఎంపీ చెప్పాడని వాళ్లకు ఇచ్చారా? ప్రభుత్వం సమాధానం చెప్పాలి.

అటవీ భూమిని అమ్మడమే తప్పు.. నీది కాని భూమిని అమ్మడం ఇంకా పెద్ద తప్పు.. పారదర్శకత లేకుండా మొదట రూ. 30 వేల కోట్లని ఆ తర్వాత రూ. 20 వేల కోట్లని చివరికి రూ. 16 వేల కోట్లకు ఆ భూమి విలువను కుదించి తన వాళ్లకు కట్టబెట్టడానికి రేవంత్ రెడ్డి ఆర్థిక మోసానికి పాల్పడుతున్నాడు. ఈ వ్యవహారాన్ని బీఆర్ఎస్ పార్టీ వదిలిపెట్టదు. ఆర్‌బీఐ గవర్నర్ కు, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్, సెబి, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ సంస్థలకు మా పార్టీ తరపున ఆధారాలతో సహా ఫిర్యాదు చేయబోతున్నాం. సమగ్ర దర్యాప్తు చేయాలని కోరుతున్నాం.ఈ మొత్తం వ్యవహారంలో రేవంత్ రెడ్డికి అండగా నిలబడ్డ బీజేపీ ఎంపీకి కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా త్వరలోనే ఆయాచిత లబ్ధి జరుగుతోంది. ఈ మొత్తం వ్యవహారంలో బీజేపీ ఎంపీ ఉన్నాడనే ఒకే ఒక్క కారణంతో ఐసిఐసిఐ బ్యాంకు లోన్ మంజూరు చేసింది. ల్యాండ్ లిటిగేషన్లో ఉందని తెలిసి కూడా.. ఐసిఐసిఐ బ్యాంకు లోన్ ఇచ్చింది. కనీసం ఆ భూమిని ఐసిఐసిఐ బ్యాంక్ ప్రతినిధులు ఎవరు ఇన్స్పెక్ట్ కూడా చేయలేదు. కేవలం బ్రోకర్ చెప్పాడని పదివేల కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వానికి ఐసిఐసిఐ బ్యాంకు చెల్లించింది. రేపు బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మొత్తం వ్యవహారాన్ని విచారిస్తాం. ఈ డబ్బులతో రైతు బంధు వేస్తామని తమ అనుకూల మీడియాలో ప్రచారం చేశారు కానీ రూ. 5000 కోట్లు కూడా అన్నదాతల ఖాతాలో వేయలేదు మిగతా రూ. 5000 కోట్లు ఏమయ్యాయి? మంత్రివర్గంలో ఉన్న కాంట్రాక్టర్లు, వాళ్ల మనుషులకు కమిషన్లు, బిల్లులు చెల్లించడానికి ఉపయోగించారు. ఈ ఆర్థిక మోసంతో ఐసిఐసిఐ బ్యాంకు క్రెడిబిలిటీ దెబ్బతింటుంది. ఆ బ్యాంకు కుప్పకూలే అవకాశం ఉంది. ఈ మొత్తం వ్యవహారం ప్రధానమంత్రికి, ఆర్థిక శాఖ మంత్రికి తెలియకుండానే జరిగిందని భావిస్తున్నాను. ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించి కేంద్ర ప్రభుత్వం తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలి. రేవంత్ రెడ్డి, ఐసిఐసిఐ బ్యాంకు, బ్రోకర్ సంస్థ పాత్రపై విచారణ జరగాల్సిందే.ఈ వ్యవహారాన్ని ఇప్పుడు అడ్డుకోకపోతే మరో అరవై వేల కోట్ల రూపాయల భూ దోపిడీకి రేవంత్ ప్రభుత్వం స్కెచ్ చేసింది." అని కేటీఆర్ అన్నారు.

# ప్రజాభవన్ ఎదుట మాజీ సర్పంచ్‌ల అర్ధనగ్న ప్రదర్శన

**బలగం టీవి, హైదరాబాద్**

పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ప్రజాభవన్ ఎదుట మాజీ సర్పంచ్‌లు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. అంగీలు విప్పి ప్రజాభవన్ ఎదుట బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని నినదించారు. పోలీసులు వారిని అరెస్టు చేసి బొల్లారం పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతున్నదని విమర్శించారు. పెండింగ్ బిల్లుల కోసం నిరసన చేపట్టడం తప్పా? అని ప్రశ్నించారు.

# ముంపు గ్రామాల ప్రజలు ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకోవాలి..

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

మిడ్ మానేరు, అనంతగిరి రిజర్వాయర్ కింద ముంపుకు గురైన (గుర్రంవాణిపల్లి, చీర్లవంచ,చింతలఠాణా, కొదురుపాక, రుద్రవరం, సంకెపల్లి, ఆరెపల్లి,అనుపురం,కొడిముంజ,వరదవెల్లి,శాభాష్ పల్లి) గ్రామాల ప్రజలు ఈ నెల 21వ తేదీ లోగా ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ అనంతగిరి రిజర్వాయర్ మిడ్ మానేరు రిజర్వాయర్ ప్రాజెక్టులకు సంబంధించి ముంపుకు గురైన (గుర్రంవాణిపల్లి, చీర్లవంచ, చింతలఠాణా, కొదురుపాక ,రుద్రవరం,సంకెపల్లి,ఆరెపల్లి,అనుపురం,కొడిముంజ,వరదవెల్లి,శాభాష్ పల్లి) గ్రామాలకు చెందిన ప్రజల నుంచి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ఈ నెల 11 వ తేదీ నుంచి 21 వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు.ఆసక్తి అర్హత గల ముంపు గ్రామాల ప్రజలు ఇందిరమ్మ ఇండ్ల కోసం మీసేవ కేంద్రంలో , జిల్లా వెబ్ సైట్ %https://rajannasircilla.telangana.gov.in/ నందు ధ్రువీకరణ పత్రాలు జతచేస్తూ దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

# తనయుడి చేతిలో తండ్రి హతం

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

ఒక్కగానొక్క కొడుకు మద్యానికి బానిసై, మద్యం మత్తులో కన్నతండ్రిని కట్టితో దాడి చేసి హతమార్చిన సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో శుక్రవారం చోటుచేసు కుంది. స్థానికుల వివరాలు ప్రకారంశుక్రవారం కాలనీలో తండ్రి కనకయ్య(45) ఓ వివాహానికి హాజరై ఇంటి ముందు కూర్చోగా, అప్పటికే మద్యం మత్తులో ఉన్న కుమారుడు పర్శరాములు తండ్రితో గొడవకు దిగాడు. మాట మాట పెరిగి ఇంటి ముందు ఉన్న కట్టెల పొయ్యిలో నుంచి ఓ కర్రను తీసుకొని విచక్షణ రహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో తండ్రి కనకయ్య మెడపై బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే కుప్పకూలాడు.పక్కనే జరుగుతున్న వివాహ వేడుకలో ఉన్న బంధువులు సంఘ టన స్థలానికి చేరుకొని అతన్ని అంబులెన్సో ఆసుపత్రికి తరలించాగా అప్పటికే మృతి చెందాడు. పర్శరాములు అక్కడి నుండి పరారయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్సై రమాకాంత్,సిఐ శ్రీనివాస్ గౌడ్ లు సంఘటన స్థలానికి చేరుకొని తల్లి, బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## మహాత్మ జ్యోతిరావు పూలేకు కలెక్టర్ ఘన నివాళి..

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**

మహాత్మ జ్యోతిరావు పూలే కు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఘనంగా నివాళులు అర్పించారు. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం నిర్వహించగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ హాజరై జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జ్యోతిరావు పూలే సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజ మనోహర్ రావు, డీపీఆర్ఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



## మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు..

**-పూలే దంపతుల విగ్రహాలు పట్టణంలో ఏర్పాటు చేయాలి**

**-అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ**

**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్ వద్ద అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే దేశ మొదటి సంఘసంస్కర్తగా, దేశంలో ఉన్న అసమానతలను తొలగించడం కోసం విద్యాను ప్రధానమైన ఆయుధంగా భావించి బడుగు బలహీన వర్గాలకు విద్యను ఆయుధంగా అందించిన మహనీయుడని కొనియాడారు. భారత దేశంలో స్త్రీలను వంటగదికే అంకితం చేసిన మనువాద కుట్ర నుంచి విముక్తి కలిగించే ఆయుధంగా విద్యను అందించడం కోసం సావిత్రిబాయి పూలేను మొదటి ఉపాధ్యాయురాలుగా తీర్చిదిద్దిన మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించుకోవడం చాలా సంతోషకరమైనది అన్నారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి శంకర్, సిరిగిరి రామచందర్, బొడ్డు రాములు, గుండా థామస్, గుడిసె మనోజ్ కుమార్, గసికంటి ప్రభాకర్, జింక శ్రీధర్, రాగుల రాంప్రసాద్, గుడిసె కిషన్, సామర్ల ప్రతాప్, ముద్రకోల గణేష్, జింక శ్రీకాంత్, కొమ్ము రణధీర్, నేదురు జనార్ధన్, శంకర్ మల్యాల శంకర్, కొమ్ము తిరుపతి తదితరులు పాల్గొన్నారు




## సాహితి సమితి ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు..

**బలగం టీవీ, సిరిసిల్ల:**

మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా రాజన్నసిరిసిల్ల జిల్లా సాహితి సమితి అధ్యక్షులు డాక్టర్ జనపాల శంకరయ్య అధ్యక్షతన ప్రధాన కార్యదర్శి వెంగళ లక్ష్మణ్ కార్యనిర్వాహణలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను వేడుకలను ఘనంగా నిర్వహించారు. జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సాహితి సమితి అధ్యక్షుడు జనపాల శంకరయ్య మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మన జ్యోతిరావు పూలే అని,జ్యోతిరావు పూలే భావితరాలకు ఆశ కిరణం అని అన్నారు.. ఈ కార్యక్రమం లో జూకంటి జగన్నాథం,మాజీ గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, సీసా సహా అధ్యక్షులు కోడం నారాయణ, సిరిసిల్ల సీనియర్ సిటిజన్ అధ్యక్షులు చే పూరి బుచ్చయ్య, శ్రీ గాదమైసయ్య, గుండెల్లి వంశీ, ఎండి ఆఫీజ్, గజ్జెల్లి సత్యనారాయణ, అంకారపు రవి, సిరిసిల్ల తిరుపతి కవులు రచయితలు పాల్గొన్నారు.

## ‘నేరెళ్ల’ ఘటనపై ఎస్సీ కమిషన్‌నే తప్పుపడతారా..

**-తక్షణమే ఆ దుష్ప్రచారాన్ని నిలిపేయండి**

**-లేనిపక్షంలో చర్యలు తప్పవు**

**-జాతీయ ఎస్సీ కమిషన్ హెచ్చరికలి**

**బలగం టీవీ, సిరిసిల్ల**

సరిగ్గా 8 ఏళ్ల క్రితం (2017లో) రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ‘నేరెళ్ల’ ఘటనలో కొంత మంది సోషల్ మీడియా వేదికగా జాతీయ ఎస్సీ కమిషన్ ను బదనాం చేస్తున్నట్లు సమాచారం అందుకున్న ఆ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచందర్ ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించారు. దళితుల పక్షాన పనిచేసే ఎస్సీ కమిషన్ ను నిందించడాన్ని తప్పు పడుతూ, తక్షణమే ఆ దుష్ప్రచారాన్ని నిలిపివేయాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా నేరెళ్ల ఘటనలో ఎస్సీ కమిషన్ జరిపిన విచారణతో పాటు ప్రభుత్వానికి పంపిన మధ్యంతర నివేదికను కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచందర్ శుక్రవారం మీడియాకు విడుదల చేశారు. బాధితులకు న్యాయం జరిగేలా, బాధ్యులపై చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేస్తూ ఆ నివేదికను రూపొందించిన అంశాన్ని గుర్తు చేశారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని నేరెళ్ల గ్రామంలో 2017 జులై లో దళితులపైన, ఇతరులపైన జరిగిన దాడి, వేధింపుల ఘటనలో జాతీయ ఎస్సీ కమిషన్ ప్రతిష్టను దిగజార్చే విధంగా కొంత మంది వ్యక్తులు మాట్లాడుతున్నట్లు ఢిల్లీలోని జాతీయ ఎస్సీ కమిషన్ దృష్టికి వచ్చిందని,మెజిస్ట్రీరియల్ అధికారులున్న ఎస్సీ కమిషన్ దళితులపై జరిగే దాడులు, వేధింపులపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయడంలో అగ్రభాగాన ఉందని పేర్కొన్నారు.

2017 జులై లో నేరెళ్ల గ్రామంలో జరిగిన ఘటనపై స్వయంగా ఎస్సీ కమిషన్ ఆ గ్రామంలో పర్యటించి, బహిరంగ విచారణ జరిపిందని,ఈ విషయం అక్కడి ప్రజలకు, అధికారులకు, పోలీస్ సిబ్బందికి తెలుసు అని, ఆ విచారణ జరిగిన వెంటనే ఎస్సీ కమిషన్ కరీంనగర్ జైలుకు వెళ్లి నేరెళ్ల బాధితులను కలిసి స్టేట్ మెంట్ రికార్డు చేయడం కూడా జరిగిందని పేర్కొన్నారు.తదుపరి జిల్లా కలెక్టర్, పోలీసు అధికారులను విచారణకు పిలిచి వారి స్టేట్ మెంట్ ను కూడా రికార్డ్ చేసి, అనంతరం అదే ఏడాది ఆగస్టు 7న అప్పటి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి మధ్యంతర నివేదికను పంపిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని కమిషన్ ఆదేశించిందని పేర్కొన్నారు. ఈ విషయం కూడా మీడియాలో వచ్చిందని, ఆగస్టు 7, 2017న ఫైల్ నెం 3/33/17టీఎస్ ఆర్ యూ పేరుతో పంపిన ఆ మధ్యంతర నివేదికలో ప్రధానంగా

ఈ ఘటనపై హైలెవెల్ కమిటీని ఏర్పాటు చేసి విచారణ జరపాలి.నేరెళ్ల ఘటనపై విచారణ సాఫీగా జరగాలంటే సిరిసిల్ల జిల్లా ఎస్పీని బదిలీ చేయాలి, ఆ జ్యూరిడిక్షన్ పరిధిలో ఉండకూడదు.సంబంధిత డీఎస్పీ, సీఐ, ఎస్ఐ లను విచారణ పూర్తయ్యే వరకు సస్పెండ్ చేయాలి.బాధితులకు పూర్తి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలి. చికిత్స అందించాలి.బాధితులకు రూ.5 లక్షల పరిహారం అందించాలి.పై అంశాలను ప్రస్తావిస్తూ చర్యలకు ఆదేశించిందని లేఖలో పేర్కొన్నారు.

## కేంద్రాన్ని పోషించే రాష్ట్రాలలో మందు వరుసలో తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

చేనేత రంగానికి చెందిన పరిశ్రమలను సిరిసిల్ల , వరంగల్ వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నామని, దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో పనిచేస్తున్న చేనేత కార్మికులు తిరిగి వచ్చేలా మౌలిక వసతుల కల్పన కృషి చేస్తున్నామని అన్నారు..ప్రభుత్వం ఏ పని చేసినా తెలంగాణ ప్రజల కష్ట ఫలితం మాత్రమేనని అన్నారు. ఉంటుందని అన్నారు.

**కంచె గచ్చిబౌలిలో 400 ఎకరాలు ముమ్మాటికి ప్రభుత్వ భూమి : పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు**

కంచె గచ్చిబౌలిలో 400 ఎకరాలు ముమ్మాటికి ప్రభుత్వ భూమి అని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. గత కాంగ్రెస్ హయాంలో నేతన్నలు కాపాడేందుకు వీలుగా అన్ని చర్యలు తీసుకున్నామని అన్నారు. నేతన్న లకు అంత్యోదయ కార్డులను గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. టెక్స్ పోర్ట్ సంస్థ ప్రతినిధులతో చర్చించి వారికి ఉన్న సమస్యలను పరిష్కరించి నేడు ఈ పరిశ్రమను ప్రారంభించామని అన్నారు. సిరిసిల్ల నేతన్న లకు దేశవ్యాప్తంగా గుర్తింపు సాధించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. సిరిసిల్ల ప్రజలకు సామాజిక స్పృహ ఎక్కువ. చైతన్యవంతమైన భూమి. ఎంతో మంది ప్రముఖులు ఇక్కడి నుంచే తమ ప్రయాణాన్ని ప్రారంభించారని అన్నారు.నేతన్నలకు ఇప్పుడు... ఎప్పుడూ కాంగ్రెస్ పార్టీనే అండగా ఉంటుందని, గత పాలకులు నేతన్నలకు చేసింది ఏమీ లేదని, కేవలం మాటలతోనే కాలం వెల్లదీశారని అన్నారు.

వేములవాడ దేవాలయభివృద్ధికి గత పాలకులు చేసింది ఏమి లేదని, మేం చిత్తశుద్ధితో ఆలయాభివృద్ధికి కృషి చేస్తున్నామని, బడ్జెట్ లో ప్రత్యేక నిధులు కేటాయించమని అన్నారు.ఈ ప్రాంతంలో విద్యాభివృద్ధికి ఆనాడు మా ప్రభుత్వంశాతవాహన యూనివర్సిటీని రెండు వందల ఎకరాల్లో ఏర్పాటు చేశామని,బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న పదేళ్లు ఈ యూనివర్సిటీని పట్టించుకోలేదని, మేం మళ్లీ అధికారంలోకి వచ్చాకా ఇంజనీరింగ్ కాలేజ్, లా కాలేజ్ మంజూరు చేశామని అన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో తమ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి చిత్తశుద్ధి తో కృషి చేస్తోందని, కానీ ప్రతిపక్షాలు కావాలనే పని కట్టుకొని తమ స్వార్థ రాజకీయాల కోసం మాపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు.కంచె గచ్చిబౌలిలో 400 ఎకరాలు ముమ్మాటికి ప్రభుత్వ ప్రభుత్వ భూమి అని,సిటీ మధ్యలో ఎక్కడైనా ఏనుగులు ఉంటాయా, ఏఐ సాయంతో ఫేక్ ఫోటోలను సృష్టించి ప్రభుత్వాన్ని బద్నాం చేశారని అన్నారు.ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతమని, చెప్పినట్లుగా రూ.2 లక్షల రుణ మాఫీ చేశాం,సన్న రకం వడ్లకు బోనస్ ప్రకటించమని అన్నారు.సహచర మంత్రులతో సమన్వయం చేసుకొని ఉమ్మడి కరీంనగర్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని అన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని ముందు వరుసలో ఉంచుతామని అన్నారు. స్థానికులకు వేల సంఖ్యలో ఉపాధి అవకాశాలు కల్పించే ఇటువంటి పరిశ్రమకు భవిష్యత్తులో ఎటువంటి అవసరమున్న ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని అన్నారు.

**వస్త్ర పరిశ్రమ పై జీఎస్టీ బండి సంజయ్ తొలగించాలి : బీసి సంక్షేమం , రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

వస్త్ర పరిశ్రమ పై జీఎస్టీ కేంద్ర మత్రి బండి సంజయ్ తొలగించాలని బీసీ సంక్షేమం , రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బెంగళూరు నగరానికి చెందిన టెక్స్ పోర్ట్ సంస్థ అప్పెరల్ పార్క్





లో 62 కోట్లతో యూనిట్ ఏర్పాటు చేయడం చాలా సంతోషమని, భవిష్యత్తులో పరిశ్రమ విస్తరణకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని, టెక్స్ పోర్ట్ సంస్థ ఇక్కడ మరింత విస్తరించాలని, స్థానికులకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖలలో అవసరమైన బట్టలను చేనేత కార్మికుల నుంచి సేకరిస్తున్నామని, మహిళా సంఘాలకు ప్రభుత్వం రెండు చీరలు ఇవ్వాలని నిర్ణయించిందని వీటి ఆర్డర్లను కూడా సిరిసిల్ల నేతన్న లకే ప్రభుత్వం అందించిందని అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ లో సన్నబియ్యం ఇస్తున్నామని,బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు సన్నబియ్యం ఇవ్వడం లేదని ప్రశ్నించారు.దమ్ముంటే వస్త్ర పరిశ్రమ పై ఉన్న జీఎస్టీ బండి సంజయ్ తొలగించాలని డిమాండ్ చేశారు.

**ధార్మిక, కార్మిక క్షేత్రాలలో అభివృద్ధిలో ఎక్కడ ఆగడం లేదు : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

ధార్మిక, కార్మిక క్షేత్రాలలో అభివృద్ధిలో ఎక్కడ ఆగడం లేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చేనేత కార్మికులకు లక్ష రూపాయల రుణ మాఫీ పూర్తి చేశామని, మహిళా సంఘాలలో ఉన్న 65 లక్షల మంది మహిళలకు ఉచిత 2 చీరలు పంపిణీ చేయాలనే నిర్ణయించి ఆ ఆర్డర్ ద్వారా చేనేత కార్మికులకు ఉపాధి కల్పన దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని అన్నారు.వేములవాడ, సిరిసిల్ల ధార్మిక, కార్మిక క్షేత్రాలు అని, అభివృద్ధిలో ఎక్కడ ఆగడం లేదు అని అన్నారు.గత బి ఆర్ ఎస్ హయంలో పెండింగ్ లో ఉన్న బతుకమ్మ చీరాల బకాయిలు చెల్లించింది కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు.ఈ ప్రాంతంలో కాటన్ పరిశ్రమ, పాలిస్టర్ పరిశ్రమ, అనుబంధ రంగ పరిశ్రమలు తీసుకొని రావాలని, ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని మంత్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రజల చిరకాల కోరిక నూలు డిపోను కూడా వేములవాడ పట్టణంలో 50 కోట్లతో ఏర్పాటు చేసుకున్నామని, దీని వల్ల 99 సంఘాలకు ఇప్పటివరకు సబ్సిడీ పై నూలు అందించామని అన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు, కంపెనీ సీఈఓ చంద్రశేఖర్ ఎస్పీ మహేష్ బీ గీతే, సెస్ ఛైర్మెన్ చిక్కాల రామారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, సిరిసిల్ల ఆర్డీవో రాధా బాయ్, వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ ఏడీ రాఘవేందర్, ప్రజా ప్రతినిధులు ప్రజలు కంపెనీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీఎస్కేకే ఘోర పరాజయం



- 8 వికెట్ల తేడాతో గెలిచిన కేకేఆర్
- 9 వికెట్లకు 103 పరుగులు చేసిన సీఎస్కే
- 10.1 ఓవర్లలోనే చేధించిన కేకేఆర్

**బలగం టీవీ, చెన్నై**

సొంతగడ్డపై చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ఘోర పరాజయం ఎదుర్కొంది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరిగిన ఐపీఎల్ మ్యాచ్ లో సీఎస్కే జట్టుపై కేకేఆర్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదట చెన్నై జట్టును 20 ఓవర్లలో 103-9 స్కోరుకే పరిమితం చేసిన కేకేఆర్... 104 పరుగుల సింపుల్ టార్గెట్ ను 10.1 ఓవర్లలోనే ఛేదించింది. ఈ క్రమంలో 2 వికెట్లు కోల్పోయి 107 పరుగులు చేసింది.

టాస్ గెలిచిన కేకేఆర్ బౌలింగ్ ఎంచుకోగా.. సీఎస్కే నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి కేవలం 103 పరుగులు మాత్రమే చేయగలిగింది. సీఎస్కే బ్యాటింగ్ ఘోరంగా విఫలమైంది. కేకేఆర్ బౌలర్లు సీఎస్కే ఓపెనర్లు ఇద్దరినీ 16 పరుగుల స్కోరు వద్ద పెవిలియన్ కు పంపారు. అనంతరం విజయ్ శంకర్, రాహుల్ త్రిపాఠి మిడిలార్డర్ లో ఇన్నింగ్స్ నిర్వహించడానికి ప్రయత్నించారు. కానీ వారు కూడా కేకేఆర్ బౌలర్ల ముందు నిలబడలేకపోయారు. విజయ్ శంకర్ 21 బంతుల్లో 29 పరుగులు చేశాడు.రాహుల్ త్రిపాఠి 22 బంతుల్లో 16 పరుగులు చేశాడు.ఒకవైపు శివం దూబే పోరాటం చేశాడు. కానీ అతను కూడా జట్టు తరపున వేగవంతమైన ఇన్నింగ్స్ ఆడలేకపోయాడు. సీఎస్కే తరపున శివం దూబే చివరి వరకు నాటౌట్ గా నిలిచాడు. 29 బంతుల్లో 31 పరుగులు చేశాడు. కేకేఆర్ తరపున సునీల్ నరైన్ అత్యధికంగా మూడు వికెట్లు పడగొట్టాడు. హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తిలు కూడా తమ మ్యాజిక్ ను ప్రదర్శించి తలో రెండు వికెట్లు పడగొట్టారు. వైభవ్ అరోరా, మొయిన్ అలీలు తలో వికెట్ తీసుకున్నారు.

అనంతరం 104 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా జట్టు 10.1 ఓవర్లలోనే రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి సునాయాసంగా విజయాన్ని సాధించింది.

చెలరేగిన క్వింటన్ డికాక్, సునీల్ నరైన్ కేకేఆర్ ఓపెనర్లు క్వింటన్ డికాక్, సునీల్ నరైన్ ముందు నుంచే దూకుడుగా ఆడారు. క్వింటన్ డికాక్ 16 బంతుల్లోనే 23 పరుగులు చేయగా.. సునీల్ నరైన్ 18 బంతుల్లోనే 44 పరుగులు చేసి ఔటయ్యారు. అనంతరం రహానే(20), రింకూ సింగ్(15)లు ఇద్దరూ కలిసి కోల్‌కతా జట్టును విజయ తీరాలకు నడిపించారు. సీఎస్కే బౌలర్లలో అన్షుల్ కాంబోజ్, నూర్ అహ్మద్ తలో వికెట్ తీయగలిగారు.

# గెలుస్తారా..?



- నేడు ఎస్ఆర్‌హెచ్‌కు కీలక మ్యాచ్
- పంజాబ్ కింగ్స్‌తో ఉప్పల్‌లో మ్యాచ్

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్ 2025 సీజన్‌లో వరుసగా ఓటములతో బాధపడుతున్న సన్ రైజర్స్ హైదరాబాద్, ఇప్పుడు తమ ప్లేఆఫ్స్ ఆశలు సజీవంగా ఉంచుకునేందుకు కీలకమైన మ్యాచ్‌లో బరిలోకి దిగనుంది. శనివారం ఉప్పల్ మైదానంలో జరిగే మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌తో ఎస్ఆర్‌హెచ్ తలపడనుంది. ఈ గేమ్‌ని నెగ్గితేనే లీగ్‌లో తమ ప్రస్థానాన్ని కొనసాగించగలదు. వరుసగా నాలుగు మ్యాచ్‌లు ఓడి తీవ్ర నిరాశలో ఉన్న జట్టుకు ఈ మ్యాచ్ చావో రేవోగా మారింది. గెలిస్తే.. రెట్టించిన ఆత్మవిశ్వాసంతో మళ్లీ విజయాల బాట పట్టి ప్లే ఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకోవచ్చు. ఓడితే మాత్రం జట్టులోని ఆటగాళ్లతో పాటు అభిమానులు మరింత నిరాశకు గురవ్వనున్నారు.

ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మలు నిలకడలేకపోవడం జట్టుకు పెద్ద ఎదురుదెబ్బ అయ్యింది. ఈ ఇద్దరూ మెరుపులు మెరిపిస్తేనే ఎస్ఆర్‌హెచ్ మళ్లీ విజయం బాట పట్టే అవకాశం ఉంది. తొలి మ్యాచ్‌లో సెంచరీ చేసిన ఇషాన్ కిషన్ ఆ తర్వాత మ్యాచ్‌ల్లో నిరాశపరిచాడు. నితీష్ కుమార్ రెడ్డి కూడా తన ఫామ్‌ను కనబరచలేకపోతున్నాడు. క్లాసెన్, అనికేత్ వర్మ మెరుపులు మెరిపించినా విజయం సాధించలేకపోయారు. అదనపు బ్యాటర్ అవసరమైతే అభినవ్ మనోహర్, అథర్వ తైడే, సచిన్ బేబీ లలో ఎవరికైనా అవకాశం దక్కవచ్చు.

గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన గత మ్యాచ్‌లో ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి వచ్చిన సిమర్జిత్ సింగ్ ఒకే ఓవర్‌లో 20 పరుగులు ఇవ్వడంతో ఓటమికి కారణమయ్యాడు. దీంతో అతనిపై వేటు పడే అవకాశాలు ఉన్నాయి. అతని స్థానంలో రాహుల్ చాహర్‌ను ప్లేయర్‌గా ఆడించే అవకాశముంది. జంపాను ఆడిస్తే కామిందు మెండిస్‌కి విశ్రాంతి ఇవ్వనున్నారు. ఇక జ్వరం కారణంగా గత మ్యాచ్‌కు దూరమైన హర్షల్ పటేల్ పూర్తిగా కోలుకుంటే జయదేవ్ ఉనాద్కత్ స్థానంలో బరిలోకి దిగే అవకాశముంది.బౌలింగ్ విభాగంలో ప్యాట్ కమిన్స్, మహమ్మద్ షమీ, ఫిట్‌గా ఉంటే హర్షల్ పటేల్ కీలక పాత్ర పోషిస్తారు.


మరోవైపు పంజాబ్ కింగ్స్ 4 మ్యాచ్‌ల్లో మూడు గెలిచి మంచి జోష్‌లో ఉంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ తరహాలోనే విధ్వంసకర బ్యాటర్లు ఆ జట్టులో ఉన్నారు. బౌలింగ్ విభాగం కూడా పటిష్ఠంగానే ఉంది. ఫీల్డింగ్ మెరుగుపరుచుకుంటే ఆ జట్టుకు తిరుగుండదు. ఇరు జట్ల బ్యాటింగ్ లైనప్ భీకరంగా ఉండటం.. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే ఉప్పల్‌లో మ్యాచ్ జరుగుతుండటంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# ఐర్లాండ్‌పై వెస్టిండీస్ విజయం

**బలగం టీవీ, హైదరాబాద్**



ఐసీసీ మహిళల వరల్డ్ కప్ క్వాలిఫయర్స్ 2025లో మాజీ ఛాంపియన్ వెస్టిండీస్ అదరగొట్టింది. స్కాట్లాండ్ చేతిలో ఓటమి నుంచి తేరుకున్న విండీస్ ఆఖరి ఓవర్ థ్రిల్లర్‌లో ఐర్లాండ్‌ను ఓడించింది. కెప్టెన్ హేలీ మాథ్యూస్ (4-24) అద్భుత బౌలింగ్ ప్రదర్శనతో వరల్డ్ కప్ అవకాశాల్ని సజీవంగా ఉంచుకుంది. శుక్రవారం జరిగిన పోరులో 182 లక్ష్యాన్ని నిర్దేశించిన విండీస్.. 6 పరుగుల తేడాతో గెలుపొందింది ఆఖరి ఓవర్లో 7 పరుగులు అవసరం కాగా.. అల్లెయె కెల్లీ(18) ని బౌల్డ్ చేసిన మాథ్యూస్ జట్టుకు విజయాన్ని అందించింది.వర్షం కారణంగా మ్యాచ్‌ను 33 ఓవర్లకు కుదించారు. మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్‌కు ఆదిలోనే షాక్. కెప్టెన్ హేలీ మాథ్యూస్(23), ఓపెనర్ క్వియానా జోసెఫ్ 4 పరుగులకే ఔటయ్యారు. 29వ ద్దే రెండు వికెట్ల పడినా సరే.. జైదా జేమ్స్(36)తో కలిసి స్టెఫానీ టేలర్(46) ఐర్లాండ్ బౌలర్లపై విరుచుకుపడింది. ఆ తర్వాత వచ్చిన చినెల్లె హెన్రీ(46 నాటౌట్) కడదాకా నిలబడి జట్టుకు భారీ స్కోర్ అందించింది.





## రామ రామ ప్రోమో విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**


చిరంజీవి 'విశ్వంభర' నుంచి ఫస్ట్ సింగిల్ ప్రోమో రిలీజ్ అయింది.చిరంజీవి ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తుండగా.. కోలీవుడ్ స్టార్ హీరోయిన్ త్రిష కథానాయికగా నటిస్తుంది. ఈ మూవీ నుంచి హనుమాన్ జయంతి కానుకగా ఏప్రిల్ 12న(నేడు) రామ రామ అంటూ ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేయనున్నారు మేకర్స్. ఈ సందర్భంగా మూవీ నుంచి ప్రోమోను పంచుకున్నారు. రామ రామ అంటూ ఫుల్ ఎనర్జీటిక్‌గా సాగిన ఈ ప్రోమో మెగా అభిమానులను ఆకట్టుకుంటుంది. ఎం.ఎం కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ పాటకు రామజోగయ్యశాస్త్రి లిరిక్స్ అందించారు.

## శరవేగంగా 'హరిహర వీరమల్లు' పనులు

**బలగం టీవీ, హైదరాబాద్**




పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా జ్యోతి కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'హరిహర వీరమల్లు'పై కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా కొనసాగుతున్నట్లు మేకర్స్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రకటించారు. రీరికార్డింగ్, డబ్బింగ్, వీఎఫ్ఎక్స్ పనులు జెట్ స్పీడ్‌తో కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ వేసవిలో ప్రేక్షకులను అలరించేందుకు బిగ్గెస్ట్ సినిమాటిక్ అద్భుతాన్ని తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. మే 9న పెద్ద స్క్రీన్లపై వీరమల్లు ఆగమనం అంటూ పోస్ట్ చేశారు. ఇక పిరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌తో తెరకెక్కుతోన్న ఈ సినిమా రెండు భాగాలుగా రానుంది. మొదటి పార్ట్ 'హరిహర వీరమల్లు పార్ట్: స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తుండగా... బాలీవుడ్ నటులు బాబీ డియోల్, అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ తదితరులు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి సంగీతం, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు.




## ఐటెం సాంగ్‌తో వచ్చిన తమన్నా

**బలగం టీవీ, హైదరాబాద్**

మిల్కీ బ్యూటీగా పేరు తెచ్చుకున్న తమన్నా సౌత్‌లో స్టార్ హీరోయిన్‌గా తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్న తర్వాత,ఆమె పలు ఐటెం సాంగ్స్ లో కూడా కనిపించింది. తెలుగు సినిమాలతో పాటు తమిళం,మలయాళం భాషల్లోనూ ఆమె ఈ తరహా పాటల్లో నటించింది. తాజాగా ఆమె మరో సినిమాలో ఓ ఐటెం సాంగ్ లో మెరిసింది. బాలీవుడ్ నటుడు అజయ్ దేవగన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'రైడ్ 2'లో తమన్నా ఒక ప్రత్యేక గీతంలో (నషా సాంగ్) నటించబోతుంది. తాజాగా దీనికి సంబంధించిన పాటను చిత్రబృందం విడుదల చేసింది. నషా నషా అంటూ ఈ పాట సాగగా.. ఇందులో తమన్నా తన డాన్స్‌తో అలరించింది. యూత్‌ను మెస్మరైజ్ చేసేలా ఆమె హాట్ లుక్ కనిపిస్తోంది. పనోరమా స్టూడియోస్ బ్యానర్‌పై భూషణ్ కుమార్, కుమార్ మంగత్ పాఠక్, అభిషేక్ పాఠక్, క్రిషన్ కుమార్ కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాను సమ్మర్ కానుకగా మే 01న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది.